తాగునీటికి కటకట

దాహార్తితో ఇందిరా కాలనీవాసుల గగ్గోలు

కైకలూరు: స్థానిక ఇందిరా కాలనీవాసులు తాగునీటికి కటకటలాడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా దళిత కాలనీల్లో సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రచారాలకు వస్తున్న నేతలు గెలిచిన తరువాత కాలనీల ముఖం చూడటం లేదు. ఇటువంటి కోవలోకి చేరే కాలనీ ఆలపాడు పంచాయతీ శివారు సోమేశ్వరం వద్ద ఇందిరా కాలనీ. ఆలపాడు పంచాయతీ పరిధిలోని ఈ కాలనీ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. భారీ వర్షాలు కురిస్తే రోజుల తరబడి నీరు నిల్వ ఉంటుంది. ప్రస్తుతం తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు.

శంకుస్థాపన చేసి వదిలేశారు

గ్రామీణ శాశ్వత గృహ నిర్మాణ పథకంలో 1987 డిసెంబరు 11న అప్పటి రాష్ట్ర గవర్నర్ కుముద్ బిన్ మణిశంకర్ జోషి ఇందిరా కాలనీకి శంకుస్థాపన చేశారు. ఎన్‌టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా, కైకలూరు ఎమ్మెల్యేగా కనుమూరి బాపిరాజు ఉన్నారు. రకరకాల మార్పులతో కాలనీ రూపాంతరం చెందింది. 2001లో కాలనీకి ప్రధాన గ్రామం నుంచి తాగునీటి పైపులైను ఏర్పాటు చేశారు. కాలనీలో సమీపంలోనే జగనన్న కాలనీని విస్తరించారు. ఇక్కడ సుమారు 300 గృహాల్లో 700 మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఆలపాడు పంచాయతీలో మొత్తం 10 వార్డులు ఉండగా కాలనీకి సంబంధించి 8, 9, 10 వార్డులు ఉన్నాయి. ఇక్కడి ప్రజలు కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు.



కైకలూరు మండలం ఆలపాడు శివారు ఇందిరా కాలనీ

తాగునీటి క్యాన్ రూ.30

పంచాయతీ కుళాయిల ద్వారా అరకొరగా సరఫరా అవుతున్న నీరు వాడుకోడానికి కూడా పని చేయడం లేదు. ఇందిరా కాలనీ ప్రజలు సమీప పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు, దుంపగడప నుంచి రోజూ క్యాన్ రూ.30కు కొనుగోలు చేసుకుంటున్నారు. ప్రతి కుటుంబంలోనూ ఒక వ్యక్తి తాగునీటికి పనులు మానేయాల్సిన పరిస్థితి. గతంలో గ్రామంలో డయారియా వ్యాపించింది. అధికారులు తాగునీటి వసతి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కంపు కొడుతున్న కుళాయి నీరు

ఉమ్మడి కృష్ణా జిల్లా శివారు నియోజకవర్గం కైకలూరు. అందులోనూ శివారు గ్రామం ఆలపాడు. ఈ గ్రామానికి తాగునీటి అవసరాల కోసం ఎనిమిది ఎకరాల చెరువు ఉంది. ఇక్కడి నుంచి పైపుల ద్వారా ఇందిరా కాలనీకి నీటిని సరఫరా చేస్తున్నారు. కాలనీలో వ్యక్తిగత కుళాయిలు మొత్తం 30 ఉన్నాయి. కాలువల ద్వారా నీటి సరఫరా లేకపోవడంతో కొల్లేరు జువ్వ కనుమ డ్రెయిన్ నీటితో పాటు పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతం నుంచి పైపుల ద్వారా వస్తున్న గోదావరి నీటిని ఆలపాడు చెరువులో నింపుతున్నారు. నెల రోజులుగా కాలనీ వాసులకు వాడుకోడానికి కూడా పని చేయని నీరు సరఫరా కావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆలపాడు నుంచి కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న మురికి నీరు

అధికారుల నిర్లక్ష్యం



ఇందిరా కాలనీపై అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెల రోజులుగా కుళాయిల ద్వారా వస్తుస్తున్న నీరు వాడుకునేందుకు కూడా పని చేయడం లేదు. వీటితో స్నానం చేస్తే దురదలు వస్తున్నాయి. పూర్తి స్థాయిలో తాగునీరు విడుదల చేసిన సందర్భాలు ఎప్పుడూ లేవు. ఇప్పటికైనా మాకు తాగునీటి సరఫరా చేయండి.

– జంగం విజయ్‌కుమార్, కాలనీపెద్ద, సోమేశ్వరం

నీటిని కొనుగోలు చేస్తున్నాం



ప్రతి ఏటా తాగునీటి సమస్యలతో అల్లాడుతున్నాం. డబ్బులు చెల్లించి నీటిని కొనుగోలు చేస్తున్నాం. పంచాయతీకి కుళాయి పన్నులు కూడా ప్రజలు చెల్లిస్తున్నారు. కాలనీలో పూర్తి స్థాయిలో డ్రెయిన్లను ఏర్పాటు చేయాలి. స్వచ్ఛమైన తాగునీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయాలి.

– పెనుమాల మరియమ్మ, 8వ వార్డు సభ్యురాలు, ఇందిరా కాలనీ

సమస్యను పరిష్కరిస్తాం



ఆలపాడు శివారు ఇందిరా కాలనీ సమస్యలపై సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటాను. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీరు మురికిగా వస్తున్నాయని తెలిసింది. పైపులైను ఎక్కడైనా పగిలిందా, సరఫరా నీరు మురికిగా ఉందా అనే విషయాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాను.

– ఆర్.ఫణీంద్ర, ఎంపీడీఓ, కైకలూరు

క్లుప్తంగా

లారీలను తొలగించిన అధికారులు



పామర్రు: 'సాక్షి' దిన పత్రికలో ఈ నెల 20వ తేదీన ప్రచురించిన 'లారీల పార్కింగ్‌తో ప్రయాణికుల ఇక్కట్లు' కథనానికి శుక్రవారం సంబంధిత అధికారులు స్పందించారు. ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ ఆ ప్రాంతంలో ఉంచిన లారీలను వేరే ప్రదేశానికి తరలించారు.

సాక్షి ఎఫెక్ట్

మిస్టర్ మస్త్-2025గా సుధీర్



గుడివాడ టౌన్: విజయవాడ కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్య పరీక్షల కార్యక్రమం మస్త్-2025లో తమ విద్యార్థి ఎం.సుధీర్ ఉత్తమ ప్రదర్శనకారుడిగా నిలిచి మిస్టర్ మస్త్ టైటిల్ కైవసం చేసుకున్నారని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ శుక్రవారం తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, కళలతో సైతం తమ ప్రతిభను ప్రదర్శిస్తూ కళాశాల ఖ్యాతిని పెంచుతున్నారన్నారు. సుధీర్‌ను కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



పామర్రు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరి బాధ్యత అని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక పామర్రు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆయన శుక్రవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఒక్క మొక్క తప్పనిసరిగా నాటాలన్నారు. మొక్కలు ఉన్న చోటు ఎంతో ఆనందంగా ఆహ్లాదంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ గంగాధరరరావు, గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, సీఐ సుభాకర్ పాల్గొన్నారు.

రసాయన మందులు తగు మోతాదులో వాడాలి



కోసూరు(మొవ్వ): మినుము పంటకు రసాయన మందులను తగిన మోతాదులోనే వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ సుధారాణి రైతులకు వివరించారు. మొవ్వ మండలం కోసూరులో మినుము పంటను శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తలు పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. చీడ పీడల నివారణకు సూచించిన రసాయన మందులు కూడా నిర్దేశించిన మోతాదులోనే పిచికారీ చేసుకోవాలన్నారు. తెల్లదోమ నియంత్రణ యాజమాన్యంలో అధిక మోతాదులో మందులను పిచికారీ చేయడం వలన మినుములో పేనుబంక, ఎర్ర నల్లి ఉధృతి పెరుగుతుందన్నారు. డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకటలక్ష్మీ, నాయకులు గోగినేని పెరుమాళ్ల పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కైకలూరు: బుడాసాహెబ్ ట్రస్టు ఆధ్వర్యంలో పెద్ద మసీదువద్ద శుక్రవారం చలి వేంద్రాన్ని ప్రారంభించారు. మసీదు పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీరు అందిచడానికి ముందుకొచ్చిన ట్రస్ట్ చైర్మన్ ఎండీ.గాలిబ్‌బాబును అభినందించారు.

నేడు పామర్రు హైస్కూల్ వార్షికోత్సవం

పామర్రు: శ్రీ కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్న తపాఠశాల ఏర్పడి 99 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా 99వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు హైస్కూల్ హెచ్‌ఎం ఆలపాటి ఇందిరాణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక హైస్కూల్లో ఆమె మాట్లాడుతూ శనివారం ఉదయం తొమ్మిది నుంచి సాయింత్రం నాలుగు గంటల వరకు వార్షికోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ముఖ్య అతిథిగా ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ జాయింట్ డైరెక్టర్ బత్తుల మనోరంజని, కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, ఉయ్యూరు డీవైఈఓ పద్మారాణి హాజరవుతారని పేర్కొన్నారు.

రేపటి నుంచి రామేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

తోట్లవల్లూరు: దక్షిణ కాశీగా పేరొందిన ఐలూరులోని శ్రీగంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 23 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ బీవీఎస్ గోపాలరావు తెలిపారు. 23న స్వామి వారిని పెండ్లి కుమారుని చేయుట, ప్రత్యేక పూజలు, హోమాలు, ధ్వజారోహణ, 24న నిత్యాభిషేకాలు, నిత్య హోమం, బలిహరణ, 25న నిత్యపూజ, బలిహరణ, పూజా అలంకారాలు, రాత్రి 10 గంటలకు సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ఉంటుందని పేర్కొన్నారు. 26న నిత్యాభిషేకాలు, నిత్య హోమం, బలిహరణ, జగజ్యోతి కార్యక్రమం, ఎదుర్కోల సన్నాహం, రాత్రి 9 గంటలకు రామేశ్వరస్వామి కల్యాణం, 27న రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 28న వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణ, మార్చి1న ద్వాదశ ప్రదక్షిణతో కార్యక్రమాలు ముగుస్తాయని పేర్కొన్నారు.



ఐలూరులోని శ్రీరామేశ్వరస్వామి ఆలయం

గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు

గుడివాడరూరల్: గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ తాలూకా ఇన్‌చార్జి, వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ఎన్.చంటిబాబుతో కలసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుడివాడ మండలంలోని లింగవరం రోడ్డులో ఆటోలో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్‌ఐ, సిబ్బంది దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1,700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారన్నారు. గంజాయి తరలిస్తున్న నిందితులు నందం సూర్య, పులవర్తి రోహిత్, బండి తంబిలను అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి రాజా వెంకట్ తప్పించుకున్నారని పేర్కొన్నారు. పంచానామ నిమిత్తం నిందితులను తహసీల్దార్ రామకోటేశ్వరరావు కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు. కాగా ఈ గంజాయిని గుడివాడ రైల్వేస్టేషన్ వద్ద ఉండే షేక్ జానీ వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు తెలిసిందని సీఐ పేర్కొన్నారు. ఈ గంజాయిని కళాశాల వద్ద అమ్మకాలు నిర్వహించేందుకు ఆటోలో తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు సీఐ పేర్కొన్నారు.



గంజాయి తరలిస్తున్న నిందితులను చూపుతున్న సీఐ, ఎస్‌ఐ

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

కైకలూరు: రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. కైకలూరు మండలం ఆచవరం రైతు సమైఖ్య కేంద్రంలో నమోదు ప్రక్రియను శుక్రవారం జేడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ తదితర సేవలకు ఈ సంఖ్య ఉపయోగపడుతుందని చెప్పారు. కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు, మండల వ్యవసాయాధికారి ఆర్.దివ్య పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: రైతులు విశిష్ట సంఖ్య నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ భానుప్రకాష్ తెలిపారు. మండలంలోని పెదలింగాలలో వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించిన విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంలో ఏఓ మాట్లాడారు. సొంత భూమి గల రైతులు తమ పొలం ఉన్న గ్రామ రెవెన్యూ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కోటి, సర్పంచ్ కలపాల నాగులు పాల్గొన్నారు.



విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును పరిశీలిస్తున్న హబీబ్ బాషా

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబాషా అన్నారు. మండలంలోని చేవూరుపాలెం, సింగరాయపాలెం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో రైతులను స్థానిక రైతుసేవా కేంద్రంలో శుక్రవారం కలిసి విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి అవగాహన కల్పించారు. మండవల్లి ఏడీఏ జి.వెంకటమణి, ఏఓ బి.వేణుమాధవ్ పాల్గొన్నారు.

అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

గుడివాడరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు విశ్వసించరని జిల్లా ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాములతో కలసి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్న సమయంలో చేసిన తప్పులను ప్రశ్నిస్తామనే భయంతో ఆయన అసెంబ్లీకి రావడం లేదన్నారు. పోలీసులను బెదిరించే రాజకీయాలకు తెర లేపడం దారుణమన్నారు. మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో సీఎం చంద్రబాబు మాట్లాడారని, ఎన్నికల కోడ్ ఉందని అధికారులు చెప్పినా వినకుండా మిర్చి యార్డ్‌కు వెళ్లాడని విమర్శించారు. సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా కన్వీనర్ బండి రామకృష్ణ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఘనంగా మాతృభాషా దినోత్సవం

గుడివాడ టౌన్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుభాషా వికాస సమితి ఆధ్వర్యంలో చైతన్య భారతి విద్యానికేతన్‌లో జరిపారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ కె. శ్రీనివాస్ సాహితీవేత్త ఉరిటి రామారావుకు ఎంఆర్ నాగేశ్వరరావు సాహితీ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, కైకాల సుమ, వాకర్స్ మహిళా అధ్యక్షురాలు దీవెన, బొగ్గారపు తిరుపతయ్య పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

తారక రామా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఏజీకే హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయులు డి.చంద్రశేఖరరావు, ఎం. ఉషారాణి, ఐ.జ్యోతిప్రియ, సయ్యద్ మహబూబ్ అలిని సత్కరించారు. అసోసియేషన్ ఫౌండర్ దండమూడి సీతారామస్వామి, ఎం. బ్రహ్మయ్య, కె. రామకృష్ణ, చిన్నం గంగాధర్ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: మాతృభాషపై ప్రతి ఒక్కరూ మమకారం పెంచుకోవాలని నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముబీన్ భాను పేర్కొన్నారు. తెలుగు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పాఠశాల్లో శుక్రవారం నిర్వహించారు. తెలుగు భాషపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి, బహుమతులు అందించారు. వర్ణమాలతో విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ఆకృతులు ఆకట్టుకున్నాయి. తెలుగు ఉపాధ్యాయులు ఫణికృష్ణ, రమాదేవి, సురేష్ పాల్గొన్నారు.

ఏఎన్నార్ కళాశాల్లో..

స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్. అప్పారావు మాతృభాష ప్రాధాన్యం, అవసరతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, తెలుగు అధ్యాపకులు డీఎస్ ప్రత్యేష, వి. సువర్ణలక్ష్మి పాల్గొన్నారు.



గుడివాడలో సాహితీవ్తే రామారావును సత్కరిస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్



పామర్రులో తెలుగు అధ్యాపకుడు శేషుకుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

పామర్రులో..

పామర్రు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ మాతృభాష వాడుక మరింత పెరగాలని, అది విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. గతంలో వచ్చిన తమ్మిలేరు వరదల సమయంలో బాధితులకు సేవలందించిన కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ శేషుకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

26న స్వామి వారి దివ్య కల్యాణం

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేంచేసియున్న భీమేశ్వస్వామి దేవస్థానం, గౌరీశంకర స్వామి వారి దేవస్థానాల్లో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు వార్షిక దివ్యకల్యాణం జరుగుతుందని ఆలయ అధికారి కె.వేణుగోపాలరావు శుక్రవారం ఒక తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 26న స్వామివారు, అమ్మవారి దివ్యకల్యాణ మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు రూ. 2,116 చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

మొవ్వ: మండలంలోని 21 గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని గుడివాడ, ఉయ్యూరు డివిజనల్ పంచాయతీ అధికారి జి.సంపత్‌కుమారి సూచించారు. మొవ్వ గ్రామంలోని తడి, పొడి చెత్త సేకరణపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. తడి చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేసి పొలాలకు ఎరువుగా వాడుకునేందుకు విక్రయించవచ్చన్నారు. పొడి చెత్తను గ్రేడింగ్ చేసి విడివిడిగా అమ్మి ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ఈఓపీఆర్‌డీ ఎంఎస్‌కే పరమాత్మ తదితరులు పాల్గొన్నారు.



మొవ్వ చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సంపత్‌కుమారి

ఉత్సాహంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఫేర్‌వెల్ డే

కైకలూరు: విద్యార్థుల ఆట పాటలతో కైకలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణం సందడిగా మారింది. సీనియర్స్, జూనియర్స్ కలిసి వీడ్కోలు కార్యక్రమాన్ని కాలేజీ వద్ద అట్టహాసంగా శుక్రవారం నిర్వహించారు. సినీ పాటలకు విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువులో రాణించాలన్నారు. దాతల సాయంతో ప్రతి గ్రూపులో మొదటిస్థానం పొందిన విద్యార్థులకు కైకలూరు టౌన్ ఎస్‌ఐ డి.వెంకట్‌కుమార్ చేతుల మీదుగా నగదు బహుమతులు అందించారు. అధ్యాపకులు కె.రవిచంద్ర, కె.విజయలక్ష్మీ, సాధిక్ హుస్సేన్, భీమరాజు, భానులక్ష్మి, జాన్‌శేఖర్, రవికుమార్, దయాకర్, గిడియన్, రామ అప్పారావు పాల్గొన్నారు.



ఫేర్‌వెల్ డేలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

రక్తదానం

గుడివాడ టౌన్: పట్టణానికి చెందిన శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రక్తం కావాల్సి వచ్చింది. దీంతో కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఊర మురళి, కె.నాగరాజు స్పందించి రక్తదానం చేశారని ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య తెలిపారు. యువకులను సీతయ్య అభినందించారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

కైకలూరు: కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి శివరాత్రి మహోత్సవంలో భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. దేవస్థానం వద్ద క్యూల ఏర్పాట్లను ఆయన శుక్రవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ టూ, ఫోర్ వీలర్స్, కార్లు, ట్రాక్టర్లకు ప్రత్యేక పార్కింగ్ కేటాయించామన్నారు. దర్శనానికి వచ్చిన భక్తులు, తిరిగి వెళ్లే భక్తులకు విడివిడిగా రహదారులు నిర్ణయించామని తెలిపారు. పవిత్ర కోనేరు వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించామన్నారు. శివరాత్రి తీర్థం నిమిత్తం దాదాపు 200 మంది పోలీసు సిబ్బందిని నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ ఈఓ వీఎస్‌కే శేఖర్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 28 వరకు మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కలిదిండి ఎస్‌ఐ వి.వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: ఆర్టీసీ బస్సును నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు స్థానిక పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని కొరగుంటపాలేనికి చెందిన బందరు విజయసాగర్ భార్యతో కలిసి బైక్‌పై ముదినేపల్లి వస్తున్నాడు. శ్రీహరిపురం బ్యాంకు వద్దకు వచ్చేసరికి బంటుమిల్లి నుంచి గుడివాడ వెళుతున్న గుడివాడ డిపోకు చెందిన బస్సు బైక్‌ను ఓవర్‌టేక్ చేసి ముందుకు వెళ్లి డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనకున్న బైక్ అదుపు తప్పి బస్సును ఢీకొనడంతో విజయసాగర్ గాయలపాలయ్యాడు. డ్రైవర్ బస్సు ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ విషయంపై బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వెల్లువెత్తిన ప్రజా సమస్యలు

గుడ్లవల్లేరు: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు గుడ్లవల్లేరు పర్యటనలో ప్రజా సమస్యలు వెల్లువెత్తాయి. శుక్రవారం సాయంత్రం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి గుడ్లవల్లేరు 3, 4వ వార్డుల్లో పర్యటించడంతో అక్కడి ప్రజలు తమ సమస్యలను ఆయనకు విన్నవించారు. డ్రెయినేజీ, తాగునీటి సమస్యలపై ఎమ్మెల్యేకు చెప్పారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

తీర్థయాత్రలకు ఆర్టీసీ బస్సు

గుడివాడ టౌన్: అరుణాచలం తీర్థయాత్రలకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్ ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ డి.రాజేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం డిపో నుంచి ఈ బస్ బయలుదేరుతుందని పేర్కొన్నారు. మూడు రోజుల యాత్రకు రూ.3 వేలు టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 73829 03299లో సంప్రదించాలని కోరారు.